ప్రజాశక్తి

శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | 5 | కర్నూలు

సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా

ఉపాధి సమస్యలపై పత్తికొండలో ప్రదర్శన

- 'ఉపాధి' సమస్యలపై మార్చి 12న అసెంబ్లీ ముట్టడి
- పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి
- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి -పత్తికొండ

ఉపాధి హామీ చట్టంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగు వేతనాలు చెల్లించాలని కోరుతూ గురువారం పత్తికొండలో వ్యవసాయ కూలీలతో ప్రదర్శన నిర్వహించారు. పలుగు, పార, మట్టిగంపలను పట్టుకుని ఆర్‌డిఒ కార్యాలయం వరకు వినూత్న రీతిలో ప్రదర్శన నిర్వహించిన అనంతరం అక్కడ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఈ నేపథ్యంలో ప్రభుత్వాల వైఖరికి నిరసనగా మార్చి 12న చలో అసెంబ్లీ ముట్టడిని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. పత్తికొండ శిరిడి సాయిబాబా ప్రాంగణంలో వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ అధ్యక్షతన గ్రామాలలో వలసలు అరికట్టాలి- ఉపాధి హామీ పనులు కల్పించాలని ఉపాధి కూలీలతో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన వి.వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉపాధి హామీ పథకం నిర్వీర్యంలో భాగంగా ఏటా ఉపాధి హామీ పథకం బడ్జెట్‌లో కోత పెడుతూ షరతులను కూడి ఉన్న చట్టాన్ని తీసుకొస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంకోసం బడ్జెట్‌లో రూ.లక్ష కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అడిగిన వారందరికీ పని కల్పించాలని , పని చేసిన వారికి ప్లే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని అడిగితే ఉపాధి కూలీలను భయపెడుతున్నారని విమర్శించారు. ఉపాధి కూలీలు పొట్టకూటికోసం ఉన్న ఊరిని వదిలి సుదూర ప్రాంతాలకు వలసలు వెళుతూ ప్రమాదాలు జరిగి అనేకమంది మరణించారన్నారు. 50 ఏళ్ల పోరాటంతోనే ఉపాధి హామీ పథకాన్ని సాధించుకున్నామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే సహించేది లేదని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ ఉపాధి కూలీలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో అనేకమంది పనులు కోసం విజయవాడ, హైదరాబాద్, తమిళనాడు, కడప, ఇతర మహా నగరాలకు వలసలు వెళ్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించి, రోజుకు రూ.500 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు పూటలా పని విధానాన్ని రద్దు చేసి, ప్లే స్లిప్పులు ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మెడికల్ కిట్లు ,టెంట్లు ఏర్పాటు చే యాలని డిమాండ్ చేశారు.పని ప్రదేశంలో ప్రమాదశాత్తు చనిపోయిన వారి కుటుంబానికి రూ.5 లక్షలు తక్షణమే అందించాలని అన్నారు. ఉపాధి కూలీ పనిచేసిన 15 రోజుల్లోపు వారి ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై అరాచకాలు, దాడులను తీవ్రంగా ఖండించారు.

సదస్సులో మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

నిరుద్యోగ భృతి చెల్లించాలని అన్నారు. మార్చి 12న విజయవాడలోని వ్యవసాయ కార్మికులతో కలిసి ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం సభ ప్రాంగణం నుండి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, ఉపాధి కూలీలు కలిసి ఆర్‌డిఒ కార్యాలయ సూపరింటెండెంట్ బాబుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పెద్దహుల్తి సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, బాలకృష్ణ, మండల అధ్యక్షుడు దస్తగిరి, సిఐటియు జిల్లా నాయకులు వేంకటేశ్వరరెడ్డి, నరసన్న, బుజ్జులు, శిఖామణి, రంగారెడ్డి, మహబూబ్ బాషా, రంగరాజు, రంగస్వామి, లక్ష్మీకాంతం, బజారి, కెపి రాముడు, అశోక్, సిద్దయ్య గౌడ్, వ్యవసాయ కూలీలు ఉపాధి కూలీలు మేటీలు పాల్గొన్నారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

పేదలకు రుణాలు మంజూరు చేయండి

- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ సంక్షేమ పథకాల తో పాటు అవసరం లో ఉన్న పేదలకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్ జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి 24 శాతం మాత్రమే రుణాలు మంజూరు చేశారని, ఇంకా రూ. 60 కోట్లు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని, మంజూరు చేయాలని కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. అగ్రికల్చర్ టర్మ్ లోన్లు కూడా 69 శాతం మంజూరు చేశారని, నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంఎస్ఎంఇలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, కరూర్ వైశ్యా బ్యాంక్, ధనలక్ష్మి, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకులు నిర్దేశించిన లక్ష్యాల సాధనలో వెనుకబడి ఉన్నాయని, లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయడంలో వెనుక బడి ఉన్నారన్నారు. లోన్ సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ బ్యాంక్ ఆఫీసర్ అభిషేక్, నాబార్డ్ డిడిఎమ్ సుబ్బారెడ్డి, ఎల్‌డిఎం రామచంద్రరావు, ఎస్‌సి ఎస్‌టి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజామహేంద్రనాథ్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో అన్ని గ్రామాల్లో జాబ్ కార్డు కలిగిన కూలీలందరికీ ఉపాధి పనులను కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య అన్నారు. గురువారం కలెక్టరేట్లోని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సమావేశ భవనంలో ఎపిడిలు, ఎపిఒలు టెక్నికల్ అసిస్టెంట్లతో పిడి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు సంబంధించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఉపాధి పనుల కల్పనపై కూలీలకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. లక్ష మందికి పైగా కూలీలకు పనులు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సమాజంలో అడిషనల్ పిడి మాధవిలతతో పాటు పలువురు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కోళ్లకు వ్యాపిస్తున్న బర్డ్ ఫ్లూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషను సిఎస్ ఆదేశించారు. గురువారం అమరావతి నుండి ఆయన జిల్లా కలెక్టర్ ఇతర ఉన్నత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చనిపోయిన కోళ్ళను సక్రమంగా పూడ్చిపెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సిఎస్ కలెక్టరును ఆదేశించారు.

వినియోగదారుల హక్కులను పరిరక్షించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

వినియోగదారుల హక్కులను పరిరక్షించే విధంగా ఆయా ప్రభుత్వ శాఖలు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, కూరగాయలు అమ్మే దుకాణాలను నిత్యం తనిఖీ చేస్తూ ఉండాలని ఆదేశించారు. హోటళ్ళు, సూపర్ మార్కెట్లు, ఎంఎల్ఎస్ పాయింట్స్, పెట్రోల్ బంక్లు,మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, తూకాల్లో మోసాలు, కల్తీ ఆహారం, ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయం లాంటి మోసాలను అరికట్టాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో పెద్ద ఎత్తున జరిగే అమ్మకాల్లో తూకాల్లో ఎక్కువ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున రైతులకు అన్యాయం జరగకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యాలకు అన్ని ప్రభుత్వ సంస్థల్లో తాగునీటి ఏర్పాటు వంటి కనీస వసతులను ఏర్పాటు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య మాట్లాడుతూ 220 పాఠశాలలో కన్స్యూమర్ క్లబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో హోటళ్ళు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్‌కృష్ణ, వినియోగదారుల సంఘం కార్యదర్శి శివమోహన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజా రఘువీర్, ఫుడ్‌సేఫ్టీ అధికారి రాజగోపాల్ రాజు, అదనపు డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్, ఆర్‌టిసి ఆర్ఎం శ్రీనివాసులు, ఆర్‌టిఒ లాల్ సింగ్ చౌహాన్, వినియోగదారుల పరిరక్షణ మండలి కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

రేషన్ బియ్యం పక్కదారి

- ఎమ్‌డియు వాహనాల నుండే
- కిలో రూ.10 నుంచి 15 వరకు చొప్పున సేకరణ
- జిల్లా కేంద్రంలోనే అవినీతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రేషన్‌బియ్యం గతంలో రేషన్ డీలర్ షాపులో నుండి మాఫియా సేకరించి పక్కదారి పట్టించేవారు. ఇప్పుడు ఇంటింటికి రేషన్ పంపిణీకి సంబంధించిన ఎండియు వాహనాలు ద్వారానే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని రేషన్ బియ్యం పక్కదారి పట్టించే మాఫియా ఏర్పడి తరలిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. రేషన్ పంపిణీకి సంబంధించి ఎండియు వాహనాలను ప్రవేశపెట్టింది. ఈ వాహనాలను రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీతో పాటు ఎండియూ ఆపరేటర్ వాటా కలుపుకోని వాహనాలను అందజేశారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా 400కు పైగా ఎండియు వాహనాలు ఉన్నాయి. ఒక వాహనానికి రెండేసి రేషన్ షాపులకు సంబంధించిన బియ్యం ఇతర వస్తువుల సరఫరాకు అప్పగించారు ఈ వ్యవస్థను ప్రారంభించే సమయంలో అనేకమంది ఆపరేటర్లు తీసుకున్నప్పటికీ తర్వాత కాలంలో మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టించే మాఫియా ఎండియు ఆపరేటర్లతో చేతులు కలిపి వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. ప్రతి నెల రేషన్ కార్డుదారులకు అందజేసే బియ్యాన్ని వాహనంలోనే కార్డుదారులకు నగదును అందజేసి నేరుగా కుంటున్నారు. కిలోరు రూ. 10 నుండి రూ.15 చొప్పున కార్డుదారులకు అందజేస్తున్నారు. ఇప్పుడు రేషన్ మాఫియా ఎండియు ఆపరేటర్లతో కలిసి అక్రమాలకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రంగా రేషన్ మాఫియా ఏర్పడి ఎండియు వాహనాల నుండే నేరుగా బియ్యాన్ని తరలిస్తున్నారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్నటువంటి ఎండియు ఆపరేటరుకు రూ 50 వేల నుండి లక్ష వరకు సంపాదిస్తున్నారు. అధిక సంఖ్యలో రేషన్ కార్డులు కలిగిన ఎండియు వాహనాలకు మరింత పెద్ద మొత్తంలో ఆదాయం పొందుతున్నటువంటి పరిస్థితి నెలకొంది. ఈ వ్యవస్థను ఆధారం చేసుకుని అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ పౌరసరఫరాల రెవెన్యూ విజిలెన్స్ పోలీస్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ శాఖలకు చెందిన అధికారులకు నేరుగా రేషన్ మాఫియా నుండి నెలవారీగా మామూళ్లను కట్టబెడుతున్నారు. నామమాత్రంగానే ఎండియు వాహనాలను వారసరఫరాల రెవెన్యూ అధికారులు తనిఖీలను నిర్వహిస్తున్నారు .ఎక్కడ కూడా 6ఎ కేసులను నమోదు చేసిన దాఖలాలలు లేవు. అలాగే దాడులు చేసి రేషన్ బియ్యం పట్టుకున్నటువంటి ఘటనలు కూడా ఈ మధ్యకాలంలో ఎక్కడ లేవు. రేషన్ మాఫియా ఇంత పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రం విఫలమవుతున్నారు. ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమంలో అవినీతి అక్రమాలను నిలువరించాలని అర్జిదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తే చర్యలు తప్పవు

- రాజా రఘువీర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎండియు వాహనాలు ద్వారా కార్డుదారులకు సక్రమంగా రేషన్ బియ్యం సరఫరా చేయాలి. అలా చేయకుండా రేషన్ బియ్యాన్ని తరలిస్తే సంబంధిత ఎండియు ఆపరేటర్ పై చర్యలు తీసుకుంటాం.

మహిళా చట్టాలపైన అవగాహన అవసరం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి సరళ దేవి అన్నారు. గురువారం కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సరోజినీ నాయుడు జయంతిని పురస్కరించుకొని జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఇందిరా శాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి.సరళాదేవి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య , పాజిటివ్ దృక్కోణంతో కూడిన సమానత్వం నేడు అవసరం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, ఎ.సత్యనారాయణ, డాక్టర్ ఫకృన్నీసా బేగం, సుజాత, నగరత్న, మెహర్ జహాన్, డాక్టర్ మాదన్న తదితరులు పాల్గొన్నారు.

డిఎంహెచ్ఒ కార్యాలయ ఆవరణలో అగ్నిప్రమాదం

దగ్ధమైన పాత అంబులెన్స్‌లు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు డిఎంహెచ్ఒ కార్యాలయం ఆవరణలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పాత వెహికల్స్, ఉపయోగంలో లేని అంబులెన్సును నిలిపి ఉన్న చోట చెత్త అంటుకోవడంతో వాహనాలకు నిప్పు అంటుకుంది. భారీగా మంటలు చెలరేగడంతో దాదాపు 10 వాహనాలకు నిప్పు అంటుంకుంది. అంబులెన్స్ వాహనాలు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



చౌడేశ్వరి దేవి జాతరలో ఆటలపోటీలు

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరులో చౌడేశ్వరీ దేవి జాతర సందర్భంగా పట్టణం పాత బస్టాండ్ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి సర్కిల్ దగ్గర క్రీడలు, సాంస్కతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఆర్ఎస్ మొబైల్స్ మొబైల్స్ అధినేత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. గోనెసంచిలో దూరి నడిచే ఆటల పోటీలలో దాదాపు 30 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ గెలుపొందిన అభ్యర్థులకు మొదటి బహుమతిగా రూ.3000 , రెండో బహుమతిగా రూ.2000, మూడో బహుమతిగా రూ.1000 బహుమతులు ప్రకటించారు. ఈ బహుమతులను చివరి రోజు అయిన 14న శుక్రవారం సాయంత్రం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమం తర్వాత స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో బహుమతి దాతలు చేతుల మీదుగా బహుమతుల్ని అందజేయనున్నారు. సంత మార్కెట్లో రుచి తిండి వీరుల పోటీ ,కబడ్డీ , కోర్టు పక్కన పొట్టేళ్ల పోటీ నిర్వహించారు. ఈ పొట్టేళ్ల పోటీని కోడుమూరు సిఐ క్రబేజ్ , ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, కోడుమూరు గ్రామీణ క్రీడలు , సాంస్కృతిక కార్యక్రమాల స్టీరింగ్ కమిటీ సభ్యులు , గ్రామ పెద్దలు స్థానిక నాయకులు ప్రజలు విరివిగా పాల్గొన్నారు.

ధీర వనిత సరోజిని నాయుడు

-పేద మహిళలకు చీరలను పంపిణీ
-జాతీయ మహిళా దినోత్సవంలో డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

దేశంలో మహిళల స్వేచ్ఛ కోసం మహిళా సాధికారత కోసం అలుపెరుగని కృషిచేసిన ధీరవనిత సరోజినీ నాయుడు అని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూల్ నగరంలోని గాయత్రి ఎస్టేట్లో ఉన్న శ్రీ గురుదత్త పాలి క్లినిక్‌లో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి13న బెంగాలీ బ్రాహ్మణ సామాజిక కుటుంబంలో అగోరనాథ్ చటోపాధ్యాయ దంపతులకు జన్మించారని తెలిపారు. ఆమె 12 సంవత్సరాల వయసులోనే మద్రాసు యూనివర్సిటీలో చదివారని అనంతరం ఇంగ్లాండులో కేంబ్రిడ్జి యూనివర్సిటీతో పాటు కింగ్స్ మెడికల్ కాలేజీలో చదువుకున్నారని వివరించారు. అదే సమయంలో భారత సంతతికి చెందిన డాక్టర్ గోవిందరాజు నాయుడుతో పరిచయం ఏర్పడి ఆయనను కులాంతర వివాహం చేసుకున్న సరోజినిదేవి తర్వాత సరోజినీ నాయుడుగా ప్రాముఖ్యం పొందారని వివరించారు. ఆమె దేశ స్వాతంత్ర పోరాటంతో పాటు మహిళల స్వేచ్ఛ కోసం మహిళా సాధికారత కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆమె కృషివల్లే భారత దేశంలో మహిళలకు అనేక హక్కులు సంక్రమించాయన్నారు. ఆమెను మహాత్మా గాంధీ నైటింగేల్ ఆఫ్ ఇండియాగా అభివర్ణించారని వివరించారు. సరోజినీ నాయుడు మంచి రచయిత, కవయిత్రి అని తెలిపారు. ఆమె మహాత్మా గాంధీతో పాటు క్విట్ ఇండియా, దండి మార్చ్ తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారన్నారు. స్వాతంత్ర పోరాటంలో భాగంగా ఆమె ఎన్నోసార్లు జైలుకు వెళ్లారని తెలిపారు. 1947లో దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర తొలి మహిళా గవర్నర్‌గా ఆమె చరిత్ర సృష్టించారన్నారు. ఆల్ ఇండియా నేషనల్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా అనిబిసెంట్ తర్వాత ఆమె ఆ పదవిని చేపట్టారని తెలిపారు. దేశంలో మహిళల వెనుకబాటు తనంపై ఎన్నో ఉద్యమాలు నడిపిన చరిత్ర ఆమెకు ఉందని తెలిపారు. దేశంలో మహిళా నిరక్షరాస్యత తక్కువగా ఉందని మహిళల్లో అక్షరాస్యత శాతాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మహిళలు అక్షరాస్యులయి ఉన్నత పదవుల్లో ఉంటేనే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని వివరించారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎన్నికలకు ముందు పీజీ సెట్‌ల నిర్వహణ గురించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం హేయమైన చర్య అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఒక సమావేశంలో వారు మాట్లాడుతూ 2021 ముందు పీజీ సెట్‌ల నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ పీజీ ప్రవేశాలు నిర్వహించేవారని, 2021 లో వైసిపి ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా , కరోనా సాకుతో ఉమ్మడి పీజీ ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించడం ప్రారంభించారు. ఇలా ఉమ్మడి పీజీ ప్రవేశాలు నిర్వహించడం ద్వారా 2021 నుంచి 2024 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విశ్వవిద్యాలయాల్లో 30 నుంచి 40శాతం అడ్మిషన్స్ లేక యూనివర్సిటీలన్నీ విలవిల్లాడి పోతున్నాయని తెలిపారు. 2024 ఎన్నికల హామీల సందర్భంగా అప్పటి తెలుగుదేశం పార్టీ నాయకులు నారా లోకేష్ ఉమ్మడి పీజీ అడ్మిషన్లను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ ప్రవేశాలు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆనాడు విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈనెల 8న రాష్ట్రవ్యాప్తంగా జగనున్న వివిధ కోర్సులకు సంబంధించిన ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో పీజీ సెట్ ఉమ్మడిగానే ఉందని ఏ యూనివర్సిటీకి యూనివర్సిటీ పీజీ సెట్ లేదని తెలిపారు. గత ప్రభుత్వం విధానాల్ని ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తూ ఉన్నత విద్యను ప్రైవేటైజేషన్, కార్పొరేటైజేషన్, కమ్యూనలైజేషన్ అనే ఉద్దేశంతో వచ్చిన నూతన జాతీయ విద్యా విధా నాన్నే కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయాల్లో ఉమ్మడి పీజీ ప్రవేశం నిర్వహించడం ద్వారా సగానికి సగం పైగా డిపార్టుమెంట్లలో అడ్మిషన్స్ లేక విలవిల్లాడిపోతున్న సందర్భంగా మళ్లీ ఉమ్మడి పీజీ ప్రవేశం నిర్వహించడం అనేది యూనివర్సిటీలను ప్రైవేట్ పరం చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీ ప్రవేశాలను నిర్వహించే విధంగా చర్యలు తీసుకొని ఉమ్మడి పిజి ప్రవేశాలను రద్దు చేయాలని, నారా లోకేష్ హామీని నిలబెట్టుకోవాలని వాళ్ళు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబూబక్కర్, సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

అడవులను కాపాడుదాం

ప్రజాశక్తి - వెల్దుర్తి

అడవులను కాపాడి వన్యప్రాణులను రక్షించుకోవాలని కర్నూలు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.విజయ్‌కుమార్ అన్నారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని రామళ్లకోట జిల్లా పరిషత్ పాఠశాలలో అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో అడవులు వన్యప్రాణుల సంరక్షణకు విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం వల్ల చెట్లు, విత్తనాలు ,జంతువులు, పక్షులు, వాటి పిల్లలు, గుడ్లు కాలిపోయి పునరుత్పత్తి లేక వట్టి కొండలుగా మిగిలిపోతాయని, అంతేకాక మానవాళికి, ఇతర జీవరాసులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందగా వర్షాలు పడక మానవ మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఎవరైనా అడవిలో చెట్లను నరకడం, అడవి జంతువులను చంపడం, అటవీ సంపదను దోచుకోవడం, నిప్పు పెట్టడం వంటివి చేయకూడదన్నారు. ఎవరైనా అలా చేస్తే అటవీ సంరక్షణ చట్టం కింద శిక్షార్హులన్నారు. సమీప గ్రామాలలోని ప్రజలు ఏవైనా అలాంటి ఘటనలు జరుగుతే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని అడవులను, వన్యప్రాణులను రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు. రామాల్లకోట, వెల్దుర్తి మహిళా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు శకుంతలమ్మ, రేణుకను ఎఫ్ఆర్ఒ విజయ్ కుమార్ అభినందించారు. అనంతరం విద్యార్థులతో రామల్లకోట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఒ ఓబులేసు, రామచంద్రుడు, ప్రధానోపాధ్యాయుడు బజారు, అటవీ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్నఎఫ్ఆర్ఒ విజయకుమార్

ప్రతి రైతుకు భూ ఆధార్ తప్పనిసరి

ప్రజాశక్తి-మద్దికేర

ప్రతి రైతు భూ ఆధార్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధి కారి రవి తెలి పారు. గురువారం ఆయన మాట్లాడారు. మండలంలో ప్రతి రైతు భరోసా కేంద్రం నందు వ్యవసాయ సహాయకుల ద్వారా భూ ఆధార్ నమోదు చేయించుకోవాలని కోరారు.ఆధార్ తో దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే, ప్రతి రైతుకు 11 నెంబర్లతో యూనిక్ కోడ్ ను కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం రైతు భరోసా కేంద్రం 2లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదును పర్యవేక్షించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ సంకల్పంతో ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపట్టినట్లు అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలు పొందాలంటే మండలంలో ప్రతి రైతు తప్పనిసరిగా భరోసా నందు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ అధికారులు జాకీర్ హుస్సేన్ రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఆలూరు అభివృద్ధిపై చిత్తశుద్ధి కరువు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు నియోజకవర్గ అభివృద్ధిపై పాలకులు, అధికారులకు చిత్తశుద్ధి లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఆలూరు డివిజన్ కార్యదర్శి పి.హనుమంతు తెలిపారు. గురువారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణ స్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా ఆలూరు నియోజకవర్గ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాగు, సాగునీరు అందించేందుకు 8 టిఎంసిలతో వేదవతి రిజర్వాయర్ నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు, పాదయాత్రలు, ధర్నాలు చేపట్టి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. 2018లో వేదవతి రిజర్వాయర్‌ను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు కోడుమూరులో వర్చువల్‌గా శంకుస్థాపన చేశారని చెప్పారు. దాదాపు రూ.1900 కోట్లు సరిపోతుందని బడ్జెట్ అంచనా వేశారని తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం రీ టెండరింగ్ పేరుతో నిధులు కేటాయించి పనులు చేపట్టినా అర్ధాంతరంగా నిధులు మళ్లించి నిర్మాణపనులు ఆపివేసేలా చేసిందన్నారు. టిడిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చినా నియోజకవర్గం వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసెంబ్లీ బడ్జెట్‌లో వేదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వేదవతి రిజర్వాయర్ నిర్మాణానికి 2024-25 బడ్జెట్‌లో రూ.500 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. 8 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్లు నిర్మించి ఆస్పరి మండలానికి కూడా తాగు, సాగునీరు అందించాలన్నారు. వేదవతి ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు ఎకరాకు రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, కరువు, వలసల నుంచి నియోజకవర్గాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. సిపిఎం డివిజన్ కమిటీ నాయకులు షాకీర్, కృష్ణ, మైనా, రత్నమ్మ పాల్గొన్నారు.

పండగలా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ : డిపిఒ

ప్రజాశక్తి - గోనెగండ్ల

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ భాస్కర్

ఈనెల 15న జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ చెత్త సంపద తయారీ కేంద్రాల వద్ద స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని డిపిఒ జి.భాస్కర్ తెలిపారు. గురువారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శనివారం గోనెగండ్లలో నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ పి.రంజిత్ బాష హాజరుకానున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లపై పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 15న జిల్లాలోని 480 చెత్త సంపద తయారీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని తెలిపారు. గ్రామస్తులు, గ్రామ పెద్దలను పిలిచి పండగ వాతావరణంలో ఆయా కేంద్రాల వద్ద కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. సోర్స్, రీసోర్స్ ప్రక్రియలో చేపట్టాల్సిన విషయాలను వివరించారు. ఎంపిడిఒ మణిమంజరి, ఇఒఆర్‌డి అనంత శయన పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు'

ప్రజాశక్తి - చిప్పగిరి

మాట్లాడుతున్న ఎంపిడిఒ అల్లా బకాష్

వేసవి ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఎంపిడిఒ అల్లా బకాష్ సూచించారు. గురువారం మండల కార్యాలయంలో ఇఒఆర్‌డి బాలన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని ప్రభుత్వం అధికారులందరినీ ఆదేశించిందని తెలిపారు. ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉంటే తెలుసుకొని సకాలంలో పరిష్కరించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. చిప్పగిరి మండలం ఆస్పిరేషనల్ బ్లాక్ కింద ఉండడంతో నిధుల కొరత ఉండదని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగియడంతో జాబ్ కార్డు ఉన్న వ్యవసాయ కూలీలు ఎవరూ వలసలు వెళ్లకుండా ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. పరిపాలన అధికారి శ్రీనివాసులు, హౌసింగ్ ఎఇ భవ్య, ఆస్పిరేషనల్ బ్లాక్ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

'ముళ్ల' దారి...!

- ముళ్ల చెట్లతో నిండిన ప్రధాన రహదారి
- నిరుపయోగంగా రహదారి
- రోడ్లు, డ్రెయినేజీ లేక వీధి ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం బిసి కాలనీలో ప్రధాన రహదారి నిరుపయోగంగా మారింది. రహదారిలో ముళ్లచెట్లు మొలచి అడవిని తలపిస్తోంది. రైతులు పొలాలకు వెళ్లేందుకు కష్టంగా మారింది. వీధిలో రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

బీసీ కాలనీ ఏర్పడి సుమారు 40 ఏళ్లవుతోంది. బీసీ కాలనీలో గల 20 అడుగుల ప్రధాన రహదారిలో ముళ్ల చెట్లు మొలచి అడవిలా తయారైంది. చెట్లు మొలవడంతో రహదారి వీలుకాక పూర్తిగా నిరుపయోగంగా మారింది. రైతులు పొలాలకు వెళ్లాలంటే ఈ రహదారిలోనే వెళ్లాలి. ఈ రహదారి దుర్భరంగా మారడంతో రైతులు వేరే మార్గంలో పొలాలకు వెళ్లాల్సి వస్తోంది. వేరే మార్గంలో వెళ్లడం వల్ల చాలామంది రైతులు తమ పొలాల్లో వెళ్లకూడదని అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఘర్షణలు కూడా జరిగాయి. ఈ రహదారి సోగనూరు గ్రామం వరకు విస్తరించి ఉంది. వినియోగంలో ఉన్నప్పుడు ఈ మార్గంలో సోగనూరు గ్రామానికి తక్కువ సమయంలో వెళ్లే వారు. గ్రామానికి తాగునీటిని అందించే బావికి వెళ్లేందుకు ఈ మార్గం ప్రధానమైంది. ప్రస్తుతం ఈ మార్గం సౌఖ్యంగా లేకపోవడంతో గ్రామానికి నీరు సరఫరా చేసే వ్యక్తులు వేరే మార్గంలో పొలాల గట్లపై వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం గ్రామానికి నీటిని సరఫరా చేసే సీనియర్ వాటర్ మేన్ పీరా సాహెబ్ వేరే మార్గంలో బావి దగ్గరకు తెల్లవారుజామున వెళ్తుండగా ఆయనను పాముకాటు వేసింది. ఆయన కోమాలోకి వెళ్లారు. ఆ భయంతో మాటలు కూడా పడిపోయాయి. వీధిలో రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సౌఖ్యంగా లేకపోవడంతో ప్రజలు వీధిలో తిరగడానికి, వాహనాల రాకపోకలకు కష్టంగా మారింది. డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

ముళ్ల చెట్లు మొలచి నిరుపయోగంగా మారిన ప్రధాన రహదారి

హామీలను గాలికి వదిలేసిన ప్రజాప్రతినిధులు

- రాజోలి హనుమంతు

ఎన్నికల సమయాల్లో ప్రజా ప్రతినిధులు వీధిలో ప్రచారానికి వచ్చిన ప్రతిసారీ ప్రధాన రహదారి, వీధిలో రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపడతామని హామీ ఇస్తారు. వారు హామీలను గాలికి వదిలేశారు. నిర్మాణాన్ని చేపట్టారు. తర్వాత చుట్టం చూపుకైనా మా కాలనీ వైపు తిరిగి చూడరు. అప్పట్లో నాయకులు గ్రావెల్ రోడ్డును వేశారు. ఆ రోడ్డు కొన్నేళ్లు కూడా తిరగకముందే ధ్వంసమైంది. వీధి మధ్యలో దట్టమైన చెట్లు ఉండడంతో ప్రమాదకరమైన పాములకు నిలయాలుగా మారాయి. రాత్రి వేళలో బయట తిరగలేని పరిస్థితి ఉంది. వర్షాకాలంలో వర్షపు నీరు నిలిచి ఇక్కడ చెరువును తలపిస్తుంది.

మోడల్ పేపర్లను అందజేస్తున్న నాయకులు, సిబ్బంది

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి

- వెంకటపతి రాజు, టిప్పు సుల్తాన్

ప్రజాశక్తి - కౌతాళం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షులు వెంకటపతి రాజు, తుంగభద్ర ప్రాజెక్ట్ ఛైర్మన్ టిప్పు సుల్తాన్ ఆకాంక్షించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కౌతాళం, హాల్వి, ఏరిగేరి, బదినేహాళ్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి సీనియర్ నాయకులు ఉలిగయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు సహకారంతో ఈ సామగ్రి అందజేసినట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా పరీక్ష పేపర్ పత్రాలను పరిశీలించి ముఖ్యమైన ప్రశ్నలను స్వీకరించి ప్రశ్న, సమాధానాలను ఉండే విధంగా పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈసారి ప్రతి విద్యార్థి ఉన్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. నాయకులు లింగేష్, రాజనందన్, రమేష్, నరసప్ప, గొట్టయ్య, నబీ, నాగరాజు, శ్రీరామ్, కకం రామాంజినేయులు, జనసేన రామాంజినేయులు పాల్గొన్నారు.

సృజనాత్మకతే అభివృద్ధికి సోపానం

- సుప్రీంకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్
- సెయింట్ జాన్స్‌లో నేషనల్ మేనేజ్‌మెంట్ మీట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వ్యక్తిగత సృజనాత్మకత పెంపొందించుకోవడమే అభివృద్ధికి సోపానమని సుప్రీంకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం ఎమ్మిగనూరు సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో విజ్డం నేషనల్ మేనేజ్‌మెంట్ మీట్‌ను ఘనంగా నిర్వహించారు. రాయలసీమ జిల్లాల నుంచి వందల సంఖ్యలో ఎంబిఎ విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా రాయలసీమ యూనివర్సిటీ నుంచి జి.రామకృష్ణ, భీమా కళాశాల నుంచి చందన్ ప్రసాద్ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా కాకర్ల చంద్రశేఖర్ హాజరయ్యారు. ప్రస్తుతం మార్కెట్‌లో అవసరమైన మార్కెటింగ్ ఆటోమేషన్, క్లౌడ్ స్టాటిస్టిక్స్ మేనేజ్‌మెంట్, కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ వంటి అధునాతన విషయాలపై ఎంబిఎ విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. కాకర్ల చంద్రశేఖర్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధాకర్, మేనేజ్‌మెంట్ మీట్ కన్వీనర్ డాక్టర్ అనిల్ మెమోంటోతో సన్మానించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ... ఎంబిఎ అనేది ఒక సర్టిఫికెట్ కోర్సు కాదని, తమ కళాశాలలో కేసు స్టడీ ఓరియెంటెడ్‌గా ఎన్నో ఈవెంట్స్ జరుపుతూ కార్పొరేట్ ప్రపంచానికి వేల సంఖ్యలో మేనేజర్లను అందించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగాధిపతి డాక్టర్ అనిల్ అమృతరాజ్ పాల్గొన్నారు.

మీట్‌లో పాల్గొన్న విద్యార్థులతో ముఖ్య అతిథులు, కళాశాల యాజమాన్యం


పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి

నూతన గృహం ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి కార్యకర్త హనుమన్న జగనన్న కాలనీలో నిర్మించిన నూతన గృహాన్ని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఎమ్మిగనూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో హనుమన్న ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశానికి ముఖ్య అతిథులుగా రాఘవేంద్ర రెడ్డి సోదరులను ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ముఖ్య అతిథులుగా ప్రదీప్ రెడ్డి, శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి కాలనీకి చేరుకోగా వారికి శాలువా, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ... పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని పేర్కొన్నారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, మాజీ ఎంపిపి జి.రాజేశ్వరి, మండల నాయకులు కాంత రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య, నాయకులు జిమ్మి, మల్లి, వీరేష్ పాల్గొన్నారు.

మసీదు ఎన్నికలు నిర్వహించాలి

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్

వినతి ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

అడ్డంకులు తొలగించి ఆదోని షాహీ జామియా మసీదు ఎన్నికలు నిర్వహించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ కోరారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. షాహీ జామియా మసీదు ఎన్నికలు జరిగి పదేళ్లయినా ఒకే వ్యక్తి ముతవల్లిగా అధికారం చలాయించడం, ఎన్నికలు చేపట్టకపోవడం శోచనీయమని తెలిపారు. ఎన్నికైన వారిలో ముగ్గురు చనిపోయినా ఇంతవరకు సౌదీ రావుఫ్ అనే ఒకే వ్యక్తి పదేళ్లుగా ముతవల్లి స్థానంలో చలామణి కావడం వ్యవస్థకు సిగ్గుచేటన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల వద్ద విద్యార్థినులు ఇళ్లకు వెళ్లే సమయంలో అక్కడ ఉండి రోడ్డుపై తిరుగుతూ ఆకతాయి వెకిలి చేష్టలు చేసే ఇద్దరూ అబ్బాయిలను పోలీసు స్టేషన్‌కు తీసుకుని వెళ్లి గురువారం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు గోనెగండ్ల సిఐ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాల, స్కూల్ వద్ద ఉదయం, సాయంత్రం రోడ్లపై ఆకతాయిలుగా తచ్చాడుతున్నా, అధిక శబ్దంతో మోటార్ సైకిల్‌ను నడుపుతూ ఇబ్బంది పెట్టినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

ప్రజాశక్తి - హోళగుంద

మండలంలోని యల్లార్తి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాగునీటి పైపు లైను ఏర్పాటు చేసినట్లు సర్పంచి కురువ ఛాముండేశ్వరి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యల్లార్తి గ్రామం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉన్నందున ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆదేశాల మేరకు కొత్త పైపు లైను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని దొడ్డి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త దేవన్నగారి మునెయ్య మృతి చెందగా బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. మునెయ్య బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. టిడిపి యువ నాయకులు రంగారెడ్డి, గోపాల్ ద్వారా విషయం తెలుసుకున్న టిడిపి ఇన్‌ఛార్జ్ రాఘవేంద్ర రెడ్డి మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని మండల యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్‌తో పంపించారు. పార్టీ తరపున బీమా ఇప్పిస్తామని తెలిపారు.

సమన్వయంతో బాల్య వివాహాల కట్టడి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

బాల్య వివాహాలను అరికట్టడానికి సమన్వయంతో పని చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బాల్య వివాహాల నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలన ఒక్క మహిళా శిశు సంక్షేమ శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్‌జిఒలు, పెద్దలు సమిష్టిగా, సమన్వయంతో పని చేస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. పెళ్లి పీటల మీద ఆపడం కాదు.. అంతవరకు రాకుండా చూడాలన్నారు. చిన్న వయస్సులో పెళ్లి చేయాలన్న ఆలోచన రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 18 ఏళ్లలోపు బాలికలను ఇబ్బంది పెడితే కేసు నమోదై, అబ్బాయిల జీవితాలు నాశనమయ్యే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించాలని, వారికి కావాల్సిన నైపుణ్యాలను నేర్పించాలని తెలిపారు. వారిలో మనోధైర్యాన్ని నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనపై పోలీసులు శ్రద్ధగా పని చేయాలని సూచించారు. వాటిని ప్రాథమిక దశలోనే గుర్తించి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వారికి తెలియజేసి, చదువు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి, వారిని చదువుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఎంఇఒలను ఆదేశించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై గోడపత్రికను ఆవిష్కరించారు.

అంగన్వాడీలతో సమావేశం : అంగన్వాడీ వర్కర్స్ ఏర్పాటు చేసిన వర్క్ షాపులో బాలింతలు, గర్భిణులు తీసువాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందించడంపై తల్లులకు వివరించాలని తెలిపారు. పిల్లల ఆరోగ్యం, ఎత్తు, బరువు క్రమం తప్పకుండా పరిశీలించి వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు, సిడిపిఒలు ఉమామహేశ్వరి, సఫరున్నీసా బేగం, నాగమణి పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అధికారులు

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

- బనవాసి కెవికె శాస్త్రవేత్త మౌనిక

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పంటల సాగులో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన విభాగ శాస్త్రవేత్త డాక్టర్ వై.మౌనిక తెలిపారు. గురువారం మండలంలోని పెద్దతుంబలం గ్రామంలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో బొప్పాయి, వంకాయ, కాకర, కళింగర సాగు చేసే రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కూరగాయలు, బొప్పాయి పంటల్లో ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. కూరగాయ పంటలో తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని, తెల్లదోమ నివారణకు డైఫేంతురన్ 1.20 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. పసుపు, నీలం రంగు జిగురు అట్టలు ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేయాలని సూచించారు. బొప్పాయి పంటలో వచ్చే తెల్లదోమ, పెనుబంక వంటి రసంపీల్చే పురుగులను అరికట్టాలని తెలిపారు. వాటి నివారణకు డైమెతోయేట్ 2 మిల్లీలీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ 0.30 మిల్లీలీటర్లు, అసెతమీప్రిడ్ 0.30 గ్రాములు మందులలో ఏదయినా మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. పండు ఈగ నివారణకు మెథల్ యూజినాల్ పండు ఈగ బుట్టలను ఎకరాకు 10 చొప్పున ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆదోని ఉద్యానవన శాఖాధికారి బి.హరేంద్ర, గ్రామ రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు రామకృష్ణ, గురుహరి, పార్వతిబాయి పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న డాక్టర్ మౌనిక

ఫేక్ కాల్స్‌ను నమ్మొద్దు

- మున్సిపల్ కమిషనర్ కృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

'మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతున్నార'ని వస్తున్న ఫేక్ కాల్స్ నమ్మి ఎవరూ నగదు పంపవద్దని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తి 63008 05117 నెంబరు నుంచి ఫోన్ చేసి 'ఆదోని మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నాను' అని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇంటి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ బకాయిలు ఎక్కువగా ఉందని, దానిని వెంటనే చెల్లించకపోతే ఇంటిని/షాపును జప్తు చేస్తామని, నీటి కుళాయి కనెక్షన్ కట్ చేస్తామని బెదిరిస్తున్నట్లు తెలిసిందని అన్నారు. బకాయి మొత్తము 'ఫోన్ పే' ద్వారా చెల్లించాలని బెదిరింపు కాల్స్ చేస్తున్నారని, ఎవరూ, ఎలాంటి నగదు పంపవద్దని తెలిపారు. ఆదోని పురపాలక సంఘం నుంచి ఎటువంటి ఫోన్లు చేయరని, బకాయిలుంటే సచివాలయ సిబ్బంది మీ దగ్గరకు వచ్చి బకాయిలు వసూలు చేస్తారని చెప్పారు. పై తెలిపిన ఫోన్ నెంబరు నుంచి కాల్ వస్తే స్పందించకుండా దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ట్యాక్స్ చెల్లించాల్సిన వారు నేరుగా మున్సిపల్ కార్యాలయం, సచివాలయంలోనే సంప్రదించాలని వివరించారు.

సిసి రోడ్డు పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని తుమ్మిగనూరు గ్రామంలో దాదాపు రూ.8.40 లక్షల మండల పరిషత్ నిధులతో సిసి రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ముఖ్య అతిథిగా వైసిపి జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. గురువారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపిపి ఈరన్న, ఇఒఆర్‌డి హరుణ్ రషీద్, పంచాయతీ రాజ్ శాఖ ఇంజినీర్ మాలిక్, సర్పంచి ఈరన్నతో కలిసి సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని నియోజక వర్గంలో తాగునీటి సమస్య లేకుండా కృషి చేస్తామన్నారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని అధికారులను సూచించారు.

భూమి పూజ చేస్తున్న నాయకులు

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. గురువారం స్వామివారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో పల్లకోత్సవం నిర్వహించారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రుని బందావనం : రాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున పూజారులు రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టువస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవరత్న స్వర్ణ రథోత్సవం ఊరేగిన రాఘవేంద్రులు

శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రుని నవరత్న స్వర్ణ రథోత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి రథోత్సవం సేవలు చేయించిన భక్తులతో సంకల్పం చేయించిన అనంతరం ఏనుగు అంబారీ, కొయ్య, వెండి, స్వర్ణ, నవరత్న స్వర్ణ రథోత్సవంపై ఉత్సవ మూర్తి ప్రహ్లాద రాయులను ఉంచి పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న నాయకులు

వివాహ వేడుకలో ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - చిప్పగిరి

ఏరూరు గ్రామానికి చెందిన చెరుకూరి బ్రదర్స్ శ్రీనివాసులు, సాగునీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి ధనుంజయ, చెరుకూరి సోమశేఖర్‌ల కుమార్తె వివాహ వేడుకలో ప్రజాప్రతినిధులు సందడి చేశారు. గురువారం జరిగిన వివాహ వేడుకకు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, వైసిపి ఆలూరు సీనియర్ నాయకులు వైకుంఠం మల్లికార్జున చౌదరి, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, మాజీ ఎంపిపి భీమ లింగప్ప చౌదరి, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు ముఖ్య అతిథులుగా హాజరయి వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే విరుపాక్షికి, వైకుంఠం మల్లికార్జున చౌదరికి చెరుకూరి బ్రదర్స్ ఘనంగా స్వాగతం పలికి పూలమాల, శాలువాతో సన్మానించారు. వచ్చిన వారందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఆలింగనం చేసుకున్నారు. మాజీ ఎంపిపి దేవేంద్రప్ప, కోనంకి మోహన్, మాజీ సర్పంచి భీమప్ప, వివిఎల్.చౌదరి, మాజీ ఎంపిటిసి మల్లికార్జున, లోకనాథ్, జహీర్ పాల్గొన్నారు.

సరోజినీ నాయుడు జీవితం స్ఫూర్తిదాయకం

- 'రావూస్'లో ఘనంగా మహిళా దినోత్సవం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సరోజినీ నాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

భారత కోకిల సరోజినీ నాయుడు జీవితం భారతీయ మహిళలకు స్ఫూర్తిదాయకమని రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ సుజనా రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, మహిళా అధ్యాపకుల ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముందుగా సరోజినీ నాయుడు చిత్రపటానికి కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్, మహిళా అధ్యాపకులు, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఇఒ సుజనా రెడ్డి మాట్లాడారు. సరోజినీ నాయుడు చేసిన సామాజిక, రాజకీయ సేవలకు గుర్తింపుగా ఈమె జయంతిని జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలతో మూసినది వరదలు సంభవించినప్పుడు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి సామాజిక వేత్తగా నిలిచారని చెప్పారు. మహిళా సాధికారత కోసం 1917లో 'ఉమెన్స్ ఇండియా అసోసియేషన్ సంస్థ'ను అనిబిసెంట్‌తో కలిసి స్థాపించారని తెలిపారు. కళాశాల విద్యార్థులు ఆమెపై కవితలు, గేయాలు ఆలపించి ఆమె పట్ల ఉన్న దేశభక్తిని చాటుకున్నారు. కల్చరల్ ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జ్ విజయ్ కుమార్, స్క్రిప్ట్ రైటర్ పాల్ రాజ్, మహిళా అధ్యాపకులు అన్నపూర్ణ, నందిని, శ్రుతి ప్రియ, సీనియర్ అధ్యాపకులు గోరంట్ల, నూర్ బాషా, రామకృష్ణ, సంపత్, వ్యాయామ అధ్యాపకులు ధనుంజయ, గోవిందు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి- దేవనకొండ

పోలీసుల సమక్షంలో చేపడుతున్న హుండీ లెక్కింపు

మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో కొలువైన శ్రీకౌలుట్ల చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం చక్రసానం, వసంతోత్సవంతో ముగిశాయి. స్వామివారి చక్రస్నానం, వసంతోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వీరయ్య ఆధ్వర్యంలో శాశ్వత, తాత్కాలిక హుండీ, ముడుపులు, కానుకలు, దర్శనార్థం టికెట్ల రూపంలో లెక్కించారు. మొత్తం రూ.3.34 లక్షల ఆదాయం సమకూరినట్లు వీరయ్య తెలిపారు. దేవాలయ శాఖ తనిఖీ అధికారి వెంకటేష్, సిబ్బంది బాల సంజన, చంద్ర, రాఘవేంద్ర, సురేష్, కప్పట్రాళ్ల, పి.కోటకొండ గ్రామ పెద్దలు ఎర్ర కౌలుట్ల, రంగడు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా ప్రమీల

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి పంచాయతీ కార్యదర్శిగా ప్రమీల గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉన్నతాధికారులు తనపై నమ్మకంతో చిప్పగిరి పంచాయతీ కార్యదర్శిగా నియమించారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో విధులు నిర్వహించి అందుబాటులో ఉండి ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తామన్నారు. ఉన్నతాధికారులు, సర్పంచి సహకారంతో విధులు నిర్వహిస్తామని తెలిపారు. మౌలిక సదుపాయాలపై దృష్టి సారిస్తామన్నారు. చిప్పగిరి సచివాలయ సిబ్బందిని కలుపుకుని అభివృద్ధి పథంలో పంచాయతీని ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సమయపాలన పాటించి అందుబాటులో ఉంటూ, విధులు నిర్వహిస్తామన్నారు.

IN THE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE,BALLARI
R.A. No.1 / 2021

Between:
Sri.D.Rasool Sab ... Appellant
AND
Zeenath Begum & another's ...Respondents

NOTICE

TO,
RESPONDENTS NO.1(c) and 1(d):-
1.(c)Shaik Ikramulla Shariff son of Late Shaik Hameedullah Shariff, Aged about 54 years.
1.(d)Shaik Fareeda Fathima daughter of Late Shaik Hameedullah Shariff, Aged about 51 years. Both are residents of House No.41/101, Kothapeta, Opposite to Police Line Mosque, N.R.Peta. Kurnool, Andhra Pradesh.

WHEREAS, the above name appellant has filed the above appeal against the respondents. You are here by directed to appear before this Hon'ble in person or by pleader duly instructed able to answer all material questions relating to the case or who shall be instructed and able to answer all such question on the day of 3/3/2025 at about 11:00 "0" clock in the forenoon to answer the claim and further you are hereby directed to file on that day your objections and to produce on the said day all documents in your possession or power upon which, you base your defence or claim for set off or counter claim in support off your defence. Take notice that default of your appearances on the day before mentioned, the petition will be heard and determined in your absence. Give under my hand and seal of the court on this 12th day of Feb 2025.

(By order of the court)

(M.Basavaraju)
Advocate for the Appellant

Shirestedar
Chief Ministerial Officer
Second Add, Dist & Sessions Court Ballari.